క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



మాగనూర్: మండలంలోని నేరడగం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వర్ణలత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటిస్తూ లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సేవలు అందించాలన్నారు. పిల్లల హాజరు శాతం, గర్భిణులు, బాలింతలకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ అవుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారంతో చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు.

బిల్లులు రాలేదంటూ మధ్యాహ్న భోజనం బంద్

ధన్వాడ: మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లులు రావడం లేదంటూ గోటూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు భోజనం చేయలేదు. ఎనిమిది నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఇప్పటి వరకు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్నామని నిర్వాహకులు వాపోయారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ నారాయణరెడ్డి, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. బిల్లులు వచ్చే విధంగా అధికారులతో చర్చిస్తామని హామీ ఇవ్వడంతో శుక్రవారం నుంచి వంట చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



మక్తల్: మున్సిపాలిటీ పరిధిలోని దండుకు చెందిన రాంరెడ్డికి మంజూరయిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవిశంకర్‌రెడ్డి, అమరేందర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

దామరగిద్ద: సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభ పరీక్షల్లో దామరగిద్ద జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పూజ రాష్ట్ర స్థాయిలో ఐదో ర్యాంక్ సాధించింది. మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభతో రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించడంపై పాఠశాల హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు తిప్పణ్ణ, మహేష్, తిరుపతి, సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు లక్ష్మణ్, బాలరాజు, ప్రభులింగం, చైర్మన్ మల్లప్ప పూజను అభినందించారు.

అంధత్వ నివారణే లక్ష్యం



కోస్గిలో టోకెన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



దామరగిద్దలో కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, దయానంద విద్యా మందిర్‌లో కంటి వెలుగును కలెక్టర్ శ్రీకోయ శ్రీహర్ష, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయలు ప్రారంభించారు.

కోస్గి: మున్సిపాలిటీలోని బీసీ కాలనీలో కంటి వెలుగును ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి ప్రారంభించారు. కోస్గి, గుండుమాల్ మండలాల పరిధిలో 4 కేంద్రాలు ఏర్పాటు చేయగా మొదటి రోజు 429 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో మున్సిపల్ చైర్ పర్సన్ మ్యాకల శిరీష, కమీషనర్ పూర్ణచందర్ రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ మధుకర్ రావు, పీహెచ్‌సీ వైద్యురాలు కిష్టమ్మతోపాటు పలువురు పాల్గొన్నారు.

ధన్వాడ: అంధత్వ నివారణ కోసమే కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు అడిషనల్ కలెక్టర్ పద్మజారాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలో కంటి వెలుగును ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంల 100 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు వాహిద్, జెడ్పీటీసీ విమల, సర్పంచు అమరేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేందర్, ఎంపీటీసీలు మాధవీ, ఉమేష్, గోవర్ధన్‌గౌడ్, ఎంపీడీఓ సద్గుణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని పాత ఆస్పత్రిలో రెండో విడత కంటి వెలుగును ఎంపీపీ శ్రీకళ, స్పెషల్ ఆఫీసర్ వీణావాణిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా 120 మందికి కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవర్ధన్, వైస్ ఎంపీపీ రవి, ఎంపటీసీ గోపాల్, శివ, డాక్టర్ రాకేష్, రాజవర్ధన్ రెడ్డి, మతిన్, అరవింద్, బాలజీలు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని పులిమామిడిలో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, ఊట్కూరులో డీపీఓ మురళీలు కంటి వెలుగును ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సర్పంచ్‌లు సూరయ్య గౌడ్, సూర్య ప్రకాశ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఎల్లగౌడ్, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఎల్కోటి నారాయణరెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ భవనంలో జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మలు కంటి వెలుగును ప్రారంభించారు.



మక్తల్‌లోని గుడిగండ్లలో కంటి వెలుగు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, ఎమ్మెల్యే చిట్టెం

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ, అమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో కంటివెలుగును ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వేపూరి రాములు, సర్పంచ్ విజయలక్ష్మి, జెడ్పీటీసీ అంజలి, బి.రాము, సలీం, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దూరు: మండల కేంద్రంలో ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డిలు కంటి వెలుగును ప్రారంభించారు. మొదటి రోజు మద్దూరులో 110 మంది పరీక్షించి 11 మందికి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో మద్దూరు, కొత్తపల్లి, జాధరావ్‌పల్లి సర్పంచ్‌లు అరుణ, రాజ్యలక్ష్మి, సుభాషిణి, వైద్యాధికారిణి శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో సర్పంచ్ రాజు, ఎంపీడీఓ సుధాకర్ రెడ్డి, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, డాక్టర్ భానుప్రకాష్, కార్యదర్శి రాఘవేంద్ర, పాల్గొన్నారు.

కృష్ణా: మండల కేంద్రంలోని రైతు వేదికలో కంటివెలుగును ఎంపీపీ పూర్ణిమాపాటిల్ ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మపాటిల్, సర్పంచ్ రాధామహాదేవ్, కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఖాదర్, ఎంపీడీఓ శ్రీనివాస్, నోడల్ ఆఫీసర్ చక్రపాణి, వైద్య బృందం పాల్గొన్నారు.

దామరగిద్ద: మండలంలోని దామరగిద్ద, బాపన్‌పల్లి గ్రామాల్లో కంటి వెలుగును జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి గోపాల్‌నాయక్, ఎంపీపీ నర్సప్ప, వైద్యాధికారి నాగజ్యోతి పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని గుడిగండ్ల, మంతన్‌గోడ్ గ్రామాల్లో జెడ్పీ చైర్ పర్సన్ వనజ, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిలు, మున్సిపాలిటీలోని లయన్స్ క్లబ్ భవనంలో ఎమ్మెల్యే చిట్టెం కంటి వెలుగును ప్రారంభించారు.



ఊట్కూరులోని పులిమామిడిలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ లక్ష్మి



మరికల్‌లో కంటి వెలుగును ప్రారంభించిన ఎంపీపీ శ్రీకళ



నారాయణపేటలోని కోటకొండలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

క్రీడలతో స్నేహభావం పెంపొందించాలి



విజేతలకు నగదు, ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్‌లో వారం రోజులుగా నిర్వహిస్తున్న జేపీఎల్ క్రికెట్ పోటీలు ముగిశాయి. మన ఊరు–మన ఆటలు కార్యక్రమంలో భాగంగా పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ప్రభాకర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. గ్రామానికి చెందిన అనంత్‌రెడ్డి జ్ఞాపకార్థం ఏటా ఈ పోటీలను నిర్వహిస్తున్నారని, ఈసారి టీషర్టులను సైతం అందించారని చెప్పారు. విజేతకు ట్రోఫీతో పాటు రూ.25వేలు, రన్నర్ జట్టుకు రూ.15వేల నగదు బహుమతి అందించామన్నారు. కార్యక్రమంలో భాలగారి నర్సింహులు, కాంత్‌కుమార్, దర్మారెడ్డి, అనిల్‌గౌడ్, భార్గవరెడ్డి, నారాయణ, తిమ్మన్న, రవి, హరీష్, లక్ష్మణ్, వెంకటేష్, వెంకట్రాములు, వెంకటప్ప పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభకు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

కోస్గి: ఈ నెల 22న నాగర్‌కర్నూల్‌లో నిర్వహించే దళిత, గిరిజన ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి కోరారు. గురువారం స్థానిక లక్ష్మీనర్సింహా ఫంక్షన్ హాల్‌లో పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి దళిత, గిరిజనులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్లు వార్ల విజయ్ కుమార్, యూసుఫ్, పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ వ్యతిరేక శక్తులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బజరంగ్‌దళ్ నాయకులు

నారాయణపేట టౌన్: దేశ వ్యతిరేక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు కలెక్టర్ కోయ శ్రీహర్షకు గురువారం వినతిపత్రం అందించారు. విశ్వహిందూ పరిషత్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా హిందూ యువకులు, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలపై కొన్ని ఉగ్రవాద సంస్థల దాడులను నిరసిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. దేశ వ్యతిరేక చర్యలను రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాల్లో హిందూ ధర్మ రక్షణ కోసం పనిచేస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలను హత్య చేస్తూ, భౌతిక దాడులకు పాల్పడుతున్న పీఎఫ్ఐ ఉగ్రవాద సంస్థ, అదే విధంగా అనేక దేశ వ్యతిరేక శక్తులపై కేసులు నమోదు చేయాలన్నారు.

కాంగ్రెస్ గెలిచేందుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి

మాగనూర్: హత్ సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టే యాత్రపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్ జోడో యాత్రకు స్ఫూర్తిగా ఈ నెల 26 నుంచి హాత్ సే హాత్ జోడో యాత్రను చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ గతంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేయబోతున్నాం అనే దానిపై గడప గడపకు తెలియజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రాజుల ఆశిరెడ్డి, మాగనూర్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నాయకులు ఉదయ్‌కుమార్, చక్రపాణిరెడ్డి, కృష్ణయ్య, చాకలి బాలప్ప, పుర్ర పరుశురాం, నేరడగం బాలప్ప, వెంకటేష్‌గౌడ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి



పులిమామిడి పాఠశాలలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న వర్కటం జగన్నాథరెడ్డి

ఊట్కూరు: మండలంలో విద్యాభివృద్ధికి ఎల్లప్పుడూ తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని వీజేఆర్ సంస్థ వ్యవస్థాపకులు, బీఆర్‌ఎస్ నాయకులు వర్కటం జగన్నాథరెడ్డి అన్నారు. గురువారం పులిమామిడిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.20 లక్షల వ్యయంతో 3500 తెలుగు మీడియం, 5 వేల ఇంగ్లిష్ మీడియం పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరయ్య గౌడ్, ఎంపీటీసీ జ్యోతి తిరుమల్‌దాసు, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, సురేశ్, స్పందన, నర్మద, లక్ష్మి పాల్గొన్నారు.

సమావేశం వాయిదా

మద్దూరు: మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. గురువారం ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎంపీపీతో పాటు మరో ఐదు మంది ప్రజా ప్రతినిధులు మాత్రమే హాజరరయ్యారు. దీంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేస్తునట్లు ఎంపీడీఓ ప్రకటించారు.

సోలార్ పలకల యంత్రంతో శబ్దాలు

కృష్ణా: సోలార్ పలకల యంత్రంతో శబ్దాలు చేయించడంతో పంటలను అడవి జంతువుల నుంచి కాపాడుకోవచ్చని రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రవిందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ముడుమాల్ రైతువేదికలో అఖిలభారత సక సేరుక చీడల యాజమాన్య విభాగం, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో మాట్లాడారు. సోలార్ పలకల యంత్రం చేసే శబ్దానికి జంతువులు పంటపొలాలకు దూరంగా వెళ్తాయని అన్నారు. వీటిని రైతులు ఉపయోగించుకోవాలని చెప్పారు. శాస్త్రవేత్తలు సునిత, ఐ.అరుణశ్రీ, రాజశేఖర్, సుదర్శన్‌గౌడ్, సర్పంచ్ వెంకటప్ప పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మద్దూరు: మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ నిర్వహించినట్లు డీఎస్‌ఓ శివ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని జై హనుమాన్ ట్రేడర్స్‌లో 15 బస్తాల రేషన్ బియ్యంను ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్ గుర్తించగా ఈ బియ్యాన్ని రేణివట్ల రేషన్ షాపు డీలర్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు. షాపు యజమాని రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు డీఎస్‌ఓ తెలిపారు. ఈ దాడుల్లో ఆర్ఐ కాళప్ప పాల్గొన్నారు.

కంటి ఆస్పత్రి ప్రారంభం

మక్తల్: మండల కేంద్రంలో మారుతి కంటి ఆస్పత్రిని గురువారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య, డాక్టర్ మల్లికార్జున్, యజమాని మోహన్‌భట్, రఘుప్రసన్నభట్, అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హక్కులు కాపాడాలి



అంజయ్యను సన్మానిస్తున్న జిల్లా నాయకులు

మక్తల్: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ మక్తల్ నియోజకవర్గం నూతన కార్యవర్గాన్ని గురువారం పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వర్కూర్ అంజయ్య, కార్యదర్శిగా అంజప్ప, మండల అధ్యక్షుడిగా సునీల్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా రమేష్, మండల కార్యదర్శిగా శ్రీనివాసులు, సోషల్ మీడియా కన్వీనర్ నరేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీని జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాసులు సూచన మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఏలిగండ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, బొంబాయి విజయ్, దండు అశోక్, చంద్రశేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కంపెనీ రద్దుకు చేపట్టిన ధర్నాను జయప్రదం చేయండి



మరికల్‌లో మాట్లాడుతున్న నాయకులు

మరికల్: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని శుక్రవారం మరికల్ బస్టాండ్ ఎదుట చేపట్టనున్న మహాధర్నా కార్యక్రమం జయప్రదం చేయాలని కంపెనీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు లక్ష్మయ్య, మురళి కోరారు. గురువారం వారు మరికల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ముప్పుగా ఉన్న ఇథనాల్ కంపెనీని ఇక్కడి నుంచి తరలించే వరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ధర్నాకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, రైతులు, కూలీలు, ప్రజాస్వామికవాదులు, రాజకీయ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వెంకట్రాములు, చంద్రశేఖర్, నాగరాజ్, రామచంద్రయ్య, సాయప్ప, తిమ్మప్ప, మధు, మౌలాలి పాల్గొన్నారు.

మరికల్: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని శుక్రవారం మరికల్ బస్టాండ్ ఎదుట మహాధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నామని కంపెనీ వ్యతిరేక పోరాట సమితి సభ్యుడు మురళి గురువారం ఒక ప్రకటనలో అన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ధర్నాకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, రైతులు, రైతు కూలీలు, ప్రజాస్వామిక వాదులు, రాజకీయ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కేటీఆర్ పర్యటన విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి

నారాయణపేట రూరల్: ఈ నెల 24న జిల్లాలో నిర్వహించనున్న కేటీఆర్ పర్యటనను విజయవంతం చేద్దామని ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు మూడో సారి వస్తున్న మంత్రి ఎన్నో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నారని, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి చొరువతో ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వడం, ప్రజా సంక్షేమంలో ముందుకు వెళ్తున్నామని కొనియాడారు. సిద్దిపేట, సిరిసిల్ల తరహాలో నారాయణపేటకు ప్రత్యేక స్థానం ఉందని, సమాంతరంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. సమావేశంలో అంజలి, కోట్ల జగన్మోహన్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, నారాయణరెడ్డి, మోహన్‌నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేటీఆర్ సభను జయప్రదం చేయాలి

మరికల్: పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి ఈనెల 24న నారాయణపేటకు వస్తున్న మంత్రి కేటీఆర్ పర్యటనను జయప్రదం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు లంబడి తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ సభకు మండలం నుంచి అత్యధికంగా జన సమీకరణ చేసేందుకు నాయకులు చొరవ చూపాలని సూచించారు.

జీవిత బీమా చెక్కు అందజేత



మక్తల్: మండలంలోని కర్ని గ్రామానికి చెందిన ఉప్పరి చిన్న అంజనేయులు శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్‌లో బీమా తీసుకొని ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆసంస్థ బ్రాంచ్ మేనేజర్ గంగుల రాజేష్‌కుమార్ చేతుల మీదుగా గురువారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.3.99లక్షల చెక్కును అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవాలని కోరారు. అనుకోకుండా పాలసీదారుడు మృతి చెందితే బాధిత కుటుంబానికి కంపెనీ తరఫున ఆర్థికసాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అక్రమ్, డీఓ ఎండీ హుస్సేన్, అసిస్టెంట్ మేనేజర్ బుచ్చారెడ్డి, ఏజెంట్ గంగాధర్ తదితరులు ఉన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

నారాయణపేట రూరల్: ఆపరేషన్ స్మైల్ బృందాలు గురువారం కోస్గి, మద్దూర్ మండలాల్లో విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మెకానిక్ షాప్, హోటళ్లు, వెల్డింగ్ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తదితర చోట్ల పనిచేస్తున్న 15 మంది బాల కార్మికులను గుర్తించారు. వెంటనే వారిని సీడబ్ల్యూసీ కార్యాలయంలో అప్పగించారు. తదుపరి పిల్లలు, వారి తల్లిదండ్రులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరు పర్చి కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు ఎస్పీ చెప్పారు. దుకాణ యజమానులకు జరిమానా విధిస్తామన్నారు. ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే డయల్ 100కు కాల్ చేసి తెలియజేయాలని కోరారు.

బాలకార్మికుల గుర్తింపు

కోస్గి: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు చేపట్టిన ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా గురువారం మద్దూర్, కోస్గిలో తనిఖీలు నిర్వహించి 15 మంది బాల కార్మికులను పట్టుకున్నారు. పలు కిరాణ దుకాణాలు, హోటళ్లు, వెల్డింగ్ షాపులతోపాటు పలు వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేయగా 15 మంది బాలకార్మికులు పట్టుబడినట్లు బృందం సభ్యులు తెలిపారు. పట్టుబడిన బాల కార్మికులను జిల్లా కేంద్రంలోని సీడబ్ల్యూసీ కార్యాలయంలో అప్పగించారు. పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు.